


Regd.No : AP-03-0000025

# సింహగర్జన

www.simhagarjana.com




ప్రచురణ : పిఠాపురం సంపుటి : 2 సంచిక : 658 ఎడిటర్ : డా. సునీల్ కుమార్ యాండ్ర శనివారం 07 ఫిబ్రవరి 2026 పేజీలు : 4 వెల : అమూల్యం

## బలప్రదర్శన కాదు..

# అభివృద్ధి ముఖ్యం

**రాయలసీమను ఉద్యాన హబ్‌గా మార్చి చూపిస్తామని వెల్లడి**

**గత ప్రభుత్వంలో పోలవరం డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయిందని విమర్శ**

**కల్తీ నెయ్యితో లడ్డూ ప్రసాదం తయారు చేయించారని ఆరోపణ**

**భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ**





2

వైసీపీ అధినేత జగన్ పరామర్శ యాత్రలపై సీఎం చంద్రబాబు ఎదురుదాడికి దిగారు. పరామర్శల పేరుతో గంటల తరబడి ట్రాఫిక్ ఆపి ప్రజలను ఇబ్బంది పెట్టడం, బలప్రదర్శనలతో రౌడీయిజం చేయడం వంటి రాజకీయాలు తన దగ్గర చెల్లవని, ఈ తరహా రాజకీయాన్ని ఎలా ఎదుర్కోవాలో తనకు బాగా తెలుసని అన్నారు. ప్రజా సమస్యలపై పోరాడకుండా కేవలం రాజకీయం కోసం బలప్రదర్శనలు చేయడం సరికాదని, ఎన్నికల సమయంలో సత్తా చాటాలని ఆయన హితవు పలికారు. గతంలో కాన్వాయ్‌తో ఒకరి మరణానికి కారణమవ్వడం, బంగారుపాళ్యంలో మామిడి రైతుల కాయలను తొక్కించడం వంటి చర్యలు వారి రౌడీయిజానికి నిదర్శనమని విమర్శించారు. కర్నూలు జిల్లా, ఎమ్మిగనూరు నియోజకవర్గం, కలుగట్లలో మీ భూమి- మీ హక్కు కార్యక్రమంలో సీఎం చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలను అందించారు.




### టీటీడీ ఇన్‌ఛార్జ్ ఈవోగా ముద్దాడ రవిచంద్ర బాధ్యతల స్వీకరణ

తిరుపతి, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 06 : తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఇన్‌ఛార్జ్ ఈవోగా సీఎంవో ముఖ్యకార్యదర్శి ముద్దాడ రవిచంద్ర శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నేడు ఉదయం సతీసమేతంగా భూవరాహ స్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి వెళ్లిన ఆయన రంగనాయకుల మండపంలో ఇన్‌ఛార్జ్ ఈవోగా బాధ్యతలు స్వీకరించి శ్రీవారిని దర్శించుకున్నారు.

### తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన

## వైసిపికి శిక్ష తప్పదు

- వైసిపి నాయకులకు దేవుడంటే భక్తి కన్నా, దోచుకోవడం పైనే మక్కువ
- దొంగే దొంగ అన్న చందంగా వైసీపీ తీరు
- కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ ధ్వజం



కాకినాడ, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 06 : హిందువులు పరమ పవిత్రంగా భావించే కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి లడ్డు ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడి అపవిత్రం చేసిన వైసీపీకి శిక్ష తప్పదని, వైసీపీ నాయకులకు దేవుడంటే భక్తికన్నా, దోచుకోవడం పైనే మక్కువని కాకినాడ పార్లమెంటు సభ్యులు తీవ్ర స్థాయిలో ద్వజమెత్తారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వంలో కమిషన్లకు కక్కుర్తి పడి తాడేపల్లి ప్యాలెస్ నుండి వచ్చిన ఆదేశాలతో నిబంధనలను తుంగలోకి తొక్కి, అర్హత లేని కంపెనీలకు నెయ్యి సరఫరా కాంట్రాక్టులు కట్టబెట్టి వేలకోట్లు దోచుకున్నారని విమర్శించారు.

# రేవంత్ రెడ్డికి హైకోర్టులో నిరాశ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి హైకోర్టులో నిరాశ ఎదురయింది. 2023 ఎన్నికల సమయంలో తనపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టేయాలని కోరతూ ఆయన దాఖలు చేసిన క్వాష్ పిటిషన్ ను హైకోర్టు కొట్టేసింది. రాజకీయ కారణాలతోనే కేసులు పెట్టారని రేవంత్ తరపు న్యాయవాదులు వాదించినప్పటికీ ఆ వాదనలతో న్యాయస్థానం ఏకీభవించలేదు. కేసు విచారణ దశలో ఉన్నందున ఇప్పుడు కొట్టివేయలేమని స్పష్టం చేస్తూ, రేవంత్ పిటిషన్ ను తిరస్కరించింది. తదుపరి విచారణను ఈ నెల 21వ తేదీకి వాయిదా వేసింది.

కేసు వివరాల్లోకి వెళితే... రేవంత్ రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 2023లో జరిగిన ఎన్నికల సమయంలో భూపాలపల్లిలో జరిగిన బహిరంగ సభలో రేవంత్ ప్రసంగిస్తూ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. దీంతో, తన వక్తిత్వాన్ని దెబ్బతీసేలా అభ్యంతరకరంగా మాట్లాడారంటూ పోలీసులకు గండ్ర ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా రేవంత్ రెడ్డిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులను కొట్టివేయాలని కోరుతూ హైకోర్టులో రేవంత్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ ను విచారించిన హైకోర్టు పిటిషన్ ను కొట్టివేసింది.



## మనకెందుకులే అనుకోవద్దు... ప్రతి భక్తుడిపై

# ధార్మిక బాధ్యత ఉంటుంది

**హిందూ ధర్మంపై దాడులు జరిగినప్పుడు మౌనం వీడాలని పవన్ పిలుపు**

**మన విశ్వాసాలను కాపాడుకోవడమంటే ఇతర మతాలకు వ్యతిరేకం కాదని స్పష్టీకరణ**



ప్రతి భక్తుడిపై ధార్మిక బాధ్యత ఉంటుందని, హిందూ దేవుళ్లను, ధర్మాన్ని కించపరిచినప్పుడు మౌనంగా ఉండకుండా తమ గళాన్ని వినిపించాలని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. సగటు హిందువు మనస్తత్వంలో మార్పు రావాలని, భయంతో లేదా సౌలభ్యం కోసం మౌనంగా ఉండే ధోరణిని వీడాలని ఆయన సూచించారు. దేవుడిపై భయం, విశ్వాసంపై గౌరవం ఉన్నప్పటికీ, మన ధర్మాన్ని ఎవరైనా దురుద్దేశంతో అపహాస్యం చేసినప్పుడు కేవలం వ్యక్తిగతంగా బాధపడి, కర్మకు వదిలేసి ముందుకు సాగే అలవాటు మారాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. పవన్ కల్యాణ్ తన అభిప్రాయాలను వివరిస్తూ, "మనం కులం, మతం, ప్రాంతం, భాషల పరంగా విభజనకు గురై ఉండవచ్చు. కానీ మనందరి ధర్మం ఒక్కటే, దేవుళ్లు కూడా అంతే. మన విశ్వాసాలను, ధర్మాన్ని ఉద్దేశపూర్వకంగా అవమానించినప్పుడు మన బాధను తెలియజేయడం మనందరి కర్తవ్యం. ఇలాంటి కీలక సమయాల్లో పాటించే మౌనం సమిష్టి చైతన్యాన్ని బలహీనపరుస్తుంది" అని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరూ కేవలం భక్తులుగా మిగిలిపోకుండా, తమ విశ్వాసాలకు స్పృహతో కూడిన సంరక్షకులుగా కూడా వ్యవహరించాలని ఆయన కోరారు. హిందూ ధర్మాన్ని రక్షించుకోవడమంటే ఇతర మతాలకు వ్యతిరేకంగా ఉండటం కాదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. తమ సొంత విశ్వాసాలను, సంప్రదాయాలను కాపాడుకోవడం మాత్రమేనని ఆయన వివరించారు. హిందువులు తమ ధార్మిక బాధ్యతను గుర్తించి, సోమరితనం వీడి, తమ విశ్వాసాల పరిరక్షణకు సమిష్టిగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మార్పు ద్వారానే హిందూ ధర్మం యొక్క గౌరవాన్ని కాపాడుకోగలమని ఆయన ట్వీట్ చేశారు.



# అశ్వారావుపేటలో బిఆర్ఎస్ జెండా ఎగరడం ఖాయం

**- బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ ఉప్పల వెంకటరమణ - అధికార పార్టీకి గుండెదడ... 13వ వార్డులో గులాబీ గర్జన**



భద్రాద్రి జిల్లా ప్రతినిధి, సింహగర్జన (పీటర్) ఫిబ్రవరి 06 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వంలో అశ్వారావుపేట రాజకీయ ముఖచిత్రం ఒక్కసారిగా మారిపోయింది. బిఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ ఉప్పల వెంకటరమణ విలేఖర్ల సమావేశంలో చేసిన ప్రసంగం ఇప్పుడు అధికార కాంగ్రెస్ పార్టీ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. 13వ వార్డులో బిఆర్ఎస్ అభ్యర్థి సంకుల స్వరూప విజయాన్ని అడ్డుకోవడం ఎవరి తరము కాదని, బెదిరింపులకు పాల్పడితే సహించేది లేదని ఆయన చేసిన హెచ్చరికలు స్థానికంగా ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.

**- దొరల పెత్తనమా? ప్రజల పౌరుషమా?**

కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికార మదంతో చక్రం తిప్పుతామని విర్రవీగుతున్నారని, కానీ వారి ఆటలు అశ్వారావుపేటలో సాగవని ఉప్పల వెంకటరమణ ఘాటుగా విమర్శించారు. మేము తలుచుకుంటే పరిస్థితి వేరుగా ఉంటుందని, ఇది ప్రజల పౌరుషానికి, మీ అహంకారానికి మధ్య జరుగుతున్న పోరాటం అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ కోటలను వణికిస్తున్నాయి. ముఖ్యంగా 13వ వార్డులో బడుగు, బలహీన వర్గాలు ఏకతాటిపైకి రావడంతో అధికార పార్టీకి ఓటమి భయం పట్టుకుందని ఆయన ఎద్దేవా చేశారు.

**- 400 పైచిలుకు మెజారిటీ ఖాయం.. ఇది వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు!**

13వ వార్డులోని గొల్ల కురుమ సామాజిక వర్గంతో పాటు మెజారిటీ ఓటర్లు సంకుల స్వరూప వైపు నిలిచారని, దాదాపు 400 ఓట్ల మెజారిటీతో ఆమె విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రత్యర్థులు ఎన్ని కుట్రలు చేసినా, బెదిరింపులకు దిగినా అశ్వారావుపేట ప్రజలు తలవంచరని, బ్యాలెట్ బాక్సుల ద్వారా సమాధానం చెబుతారని హెచ్చరించారు. తమ అభ్యర్థిని గెలిపించుకోవడం ద్వారా అశ్వారావుపేట ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటామని ఉప్పల వెంకటరమణ గర్జించారు.

**- అశ్వారావుపేటలో మారిన రాజకీయ సమీకరణాలు**

ఉప్పల వెంకటరమణ ప్రసంగంతో కాంగ్రెస్ డిఫెన్స్‌లో పడిపోయిందని, బెదిరింపులకు భయపడం మా అభ్యర్థి స్వరూపమ్మను గెలిపించుకుంటామని, 13వ వార్డులో బిఆర్ఎస్ జెండా ఎగరడం చారిత్రక అవసరమని, కాంగ్రెస్ నాయకులూ మీ గడీల పాలన ఇక సాగదని బిఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు

# తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన వైసిపికి శిక్ష తప్పదు

ఎన్.డి.డి.బి నివేదికలో నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపారని ప్రాథమికంగా నివేదిక ఇవ్వగా, తాజాగా సిట్ నివేదికలో అసలు పాలే లేకుండా కేవలం రసాయనలతో నెయ్యి తయారు చేశారని నివేదిక ఇచ్చిందన్నారు. కల్తీ జరిగిందని నివేదికలు ఇచ్చినా వైసిపి నాయకులు తప్పుడు ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు. వైసీపీ నాయకులకు దమ్ముంటే నెయ్యి కల్తీ జరగలేదని అలిపిరి మెట్లు వద్ద వెంకన్న సాక్షిగా ప్రమాణం చేయాలని సవాల్ విసిరారు. గత వైసిపి ఐదేళ్ల పాలనలో 1.61 కోట్ల కిలోల నెయ్యి కొనుగోలు చేస్తే అందులో 60 లక్షల కిలోల నెయ్యి కల్తీ అయ్యిందన్నారు. ఈ కల్తీ నెయ్యితో 20 కోట్ల శ్రీవారి లడ్డులు తయారుచేసి వైసీపీ ప్రభుత్వం ఘోర అపచరానికి పాల్పడిందని దుయ్యబట్టారు. ఈ వాస్తవాలు బయటకు వస్తాయని భయంతోనే వైసీపీ నాయకులు ఎదురుదాడికి దిగుతూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు చేసిన పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ హెచ్చరించారు

## మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలించిన ప్రకాశం జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనరు యమ్.పానకాల రావు



మార్కాపురం జిల్లా ప్రతినిధి, సింహగర్జన (ముత్యాల నరేష్ రెడ్డి) ఫిబ్రవరి 06 : ప్రకాశం జిల్లా చంద్రశేఖరపురం మండలం కోవిలంపాడు పోస్టు మిట్టపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ నారాయణ స్వామి వారి దేవస్థానములో ఈ నెల 15వ తేదీన జరగబోవు మహాశివరాత్రి ఏర్పాట్లను ప్రకాశం జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనరు యమ్.పానకాల రావు పరిశీలించారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రస్తుతము జరుగుచున్న పనులను పరిశీలించి, భక్తులకి ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపరిండెంట్ జి.శ్రీధర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ జీ.ఎ.సత్య నారాయణ, ఇన్స్పెక్టర్ చైతన్య, ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీగిరిరాజు నరసింహబాబు మరియు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం

**- 07, 08 తేదీల్లో ఫెసిలిటేషన్ సెంటర్లలో ఓటు హక్కు వినియోగం : జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్**




భద్రాద్రి జిల్లా ప్రతినిధి, సింహగర్జన, ఫిబ్రవరి 06 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అశ్వారావుపేట ఇల్లందు మరియు కొత్తగూడెం మున్సిపాలిటీల పరిధిలో నిర్వహించనున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఎన్నికల విధుల్లో నియమితులైన అధికారులు, ఉద్యోగులు, పోలింగ్ సిబ్బంది మరియు సహాయక సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే సదుపాయం కల్పిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉండటం వలన పోలింగ్ రోజున తమ స్వంత పోలింగ్ స్టేషన్‌లో ఓటు వేయలేని సిబ్బంది ప్రజాస్వామ్య హక్కును కోల్పోకుండా ఉండేందుకు ఎన్నికల నియమాల ప్రవర్తన 1961లోని రూల్ 27ఎ, రూల్ 28 మరియు ప్రజా ప్రాతినిధ్యం చట్టం 1951 లోని సెక్షన్ 60 ప్రకారం ఈ పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ మేరకు అశ్వారావుపేట, ఇల్లందు మరియు కొత్తగూడెం మున్సిపాలిటీలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఓటు హక్కు కలిగిన ఎన్నికల సిబ్బంది కొత్తగూడెం మరియు పాల్వంచ మున్సిపాలిటీ కార్యాలయాలలో ఇల్లందు మున్సిపాలిటీ పరిధిలోని ఓటర్లు ఇల్లందు మున్సిపాలిటీ కార్యాలయంలో అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో ఓటు హక్కు కలిగిన వారు అశ్వారావుపేట మున్సిపాలిటీ కార్యాలయంలో ఈ నెల 07 మరియు 08 తేదీల్లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకోవచ్చని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల విధుల్లో నియమితులైన అన్ని శ్రేణుల అధికారులు, ఉద్యోగులు, పోలింగ్ సిబ్బంది, ఎన్నికల నిఘా బృందాలు, డ్రైవర్లు, భద్రతా సిబ్బంది తదితరులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చని తెలిపారు. ఇందుకోసం ఎన్నికల విధుల ఉత్తర్వు ప్రతిలిపి, ఉద్యోగ గుర్తింపు కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు (ఈపిఐసి) మరియు ఒక పాస్‌పోర్ట్ సైజు ఫోటో తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు. ఫెసిలిటేషన్ సెంటర్లలో అవసరమైన పత్రాల ధృవీకరణ అనంతరం పోస్టల్ బ్యాలెట్ పేపర్ జారీ చేయబడుతుందని, నిర్ణీత విధానంలో గోప్యంగా ఓటు వినియోగించి, సీల్ చేసిన ఎన్వలప్‌ను రిటర్నింగ్ అధికారి సమక్షంలో ఏర్పాటు చేసిన సీల్ చేయబడిన పోస్టల్ డ్రాప్ బాక్స్‌లో వేయవలసి ఉంటుందని తెలిపారు. ఈ మొత్తం ప్రక్రియ పూర్తిగా గోప్యతతో ఎన్నికల నిబంధనల ప్రకారం నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రతి అధికారి మరియు సిబ్బంది తమ ప్రజాస్వామ్య హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని, ఇందుకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడినదని జిల్లా ఎన్నికల అధికారి విజ్ఞప్తి చేశారు. నిర్ణీత తేదీల్లో అందరూ వ్యక్తిగతంగా హాజరై తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

# శీర్షిక : మై డ్రీమ్స్ డాట్ కాం



ఏదో ఒక రోజు “లంచం“ అనే పదమే
చరిత్ర పుస్తకాల్లోకి చేరిపోతుంది
అప్పుడు మనం చేసిన పాపాలకు
క్షమాపణ కోరుకుంటాం... కానీ ఎవరిని అడిగి!?

ఏదో ఒక రోజు ఓటు అనేది
ధన్యవాదం కాదు ఒక హెచ్చరిక అవుతుంది
అప్పుడు నీ చేతిలోని ఆ బటన్
నిజమైన ఆయుధంలా మారుతుంది.

ఒక్కోసారి మనమే
మన సొంత జీతాన్ని తగ్గించుకుని
నిజాయితీని కొనుగోలు చేద్దాం
అది ఎవ్వరూ దొంగిలించలేని
శాశ్వత సంపదగా నిలుస్తుంది.

ఒక రోజు మనం
దేవుడి పేరుతో కాక
మనిషి పేరుతో గెలవాలని ఆశిద్దాం
అప్పుడే నిజమైన గెలుపు మొదలవుతుంది.

మై డ్రీమ్స్ డాట్ కామ్
ఇంకా లోడ్ కాలేదు.. బఫరింగ్ జరుగుతోంది
కానీ ప్రోగ్రెస్ బార్ మెల్లగా నిండుతోంది

ప్రతి చిన్న నిరాశను దాటుతూ..
ప్రతి చిన్న ధైర్యాన్ని కూడగట్టుకుంటూ..
ఎప్పుడో ఒక రోజు
స్క్రీన్ మీద కనిపిస్తుంది
“జుతీతీశీతీ 404 జశీతీతీబజు్‌అశీఅ చీశీ ఖీశీబఅఅ”
ఆ రోజు కోసం
నేనింకా రిఫ్రెష్ చేస్తూనే ఉన్నాను...

**రాము కోలా, దెందుకూరు**
**ఖమ్మం। ఫోన్: 9849001201**

# బలప్రదర్శన కాదు.. అభివృద్ధి ముఖ్యం

అనంతరం ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగించారు.గత ఐదేళ్ల పాలనలో శ్రీవేంకటేశ్వర స్వామి ప్రతిష్ఠను దెబ్బతీసేలా కల్తీ ప్రసాదంతో టీటీడీని అపవిత్రం చేశారని చంద్రబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. బాత్రూంలు శుభ్రపరిచే రసాయనాలతో తయారుచేసిన కల్తీ నెయ్యితో లడ్డూలు చేయించారని, దీనిపై సీబీఐ, సిట్ క్లీన్‌చిట్ ఇచ్చిందని అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. తాము ఇప్పుడు ఆ తప్పును సరిదిద్ది, నాణ్యమైన లడ్డూ ప్రసాదాన్ని అందిస్తున్నామని తెలిపారు.ఒకవైపు ప్రతిపక్ష రాజకీయ శైలిపై విమర్శలు గుప్పిస్తూనే, మరోవైపు తమ ప్రభుత్వ అభివృద్ధి అజెండాను, ముఖ్యంగా రాయలసీమ ప్రగతికి సంబంధించిన ప్రణాళికలను ఆయన వివరించారు. ఒకప్పుడు కరవుతో అల్లాడిన రాయలసీమను ఉద్యాన హబ్‌గా మారుస్తున్నామని, ఏటా 200 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు ఈ ప్రాంతం నుంచే వస్తున్నాయని చెప్పారు. డ్రిప్ ఇరిగేషన్ వంటి సౌకర్యాలతో సీమకు నీరందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. తాను రాయలసీమ బిడ్డనని, ఎన్టీఆర్ కూడా ఈ ప్రాంత ముద్దుబిడ్డేనని గుర్తుచేశారు.గత పాలకులు పోలవరాన్ని గోదాట్లో ముంచేశారని, డయాఫ్రామ్ వాల్ కొట్టుకుపోయేలా చేసి రూ.400 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని విమర్శించారు. ఇప్పుడు తాము అదనంగా రూ.1000 కోట్లతో డయాఫ్రామ్ వాల్‌ను పునర్నిర్మిస్తున్నామని, గోదావరి పుష్కరాల నాటికి పోలవరం పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని హామీ ఇచ్చారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాకు నీళ్లిచ్చి, శ్రీశైలం నీటిని రాయలసీమకు మళ్లించిన దూరదృష్టి తమదని పేర్కొన్నారు.రాయలసీమ లిఫ్ట్ పేరిట గత పాలకులు డ్రామాలు ఆడారని, అనుమతులు లేవని ఎన్జీటీ ఆపినా మళ్లీ నాటకాలు మొదలుపెట్టారని ఎద్దేవా చేశారు. తాము వెస్ట్ కర్నూలులో వేదవతి ప్రాజెక్టు, గురు రాఘవేంద్ర, రాజోలిబండ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గుండ్రేవుల ప్రాజెక్టుపై పొరుగు రాష్ట్రాలతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. భవిష్యత్తులో విద్యుత్ ఛార్జీలు పెంచేది లేదని, ప్రజలపై ఎలాంటి భారం మోపబోమని ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మంత్రులు అనగాని సత్యప్రసాద్, నిమ్మల రామానాయుడు, టీజీ భరత్, ఎంపీ నాగరాజు, స్థానిక ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తప్పిపోయిన బాలుడుని తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు




గుడ్లూరు, కావలి రూరల్ మండలం వైకుంఠపురం గ్రామానికి చెందిన 12 వ సంవత్సరాల వయసున్న అబ్బాయి గుడ్లూరు మండలం చేవూరు గ్రామ సమీపాన ఉన్న రామదూత ఆశ్రమంలో ఐదవ తరగతి చదువుతూ శుక్రవారం ఉదయం స్కూల్ నుండి వెళ్లిపోగా వారి తల్లిదండ్రులు కృష్ణమూర్తి - స్వరూప గుడ్లూరు పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారు. వెంటనే స్పందించిన పోలీసులు వారి తల్లిదండ్రులతో కలిసి వెతకగా రుద్రకోట సమీపంలో ఉన్న అయ్యప్ప స్వామి గుడి దగ్గరలో తిరుగుతుండగా గమనించి తీసుకొని వచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు

# ఈ బుద్ధుడుని కరుణించండి

# కమిషనర్ సార్

## -నిధులు ఎక్కడికి? బాధ్యత ఎవరిది ?

## -జగ్గయ్యపేట మున్సిపాలిటీ ఘోర నిర్లక్ష్యం.




జగ్గయ్యపేట, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 06 : జగ్గయ్యపేటలోని కృష్ణుడి గుడికి ఆనుకొని ఉన్న ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖకు చెందిన పర్యాటక స్థలం ప్రస్తుతం అధికారుల అశ్రద్ధకు నిదర్శనంగా మారింది. అభివృద్ధి మాటలు చెప్పే జగ్గయ్యపేట మున్సిపాలిటీ, వాస్తవానికి ఈ ప్రభుత్వ ఆస్తిని పూర్తిగా విస్మరించిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పర్యాటకులను ఆకర్షించాల్సిన ఈ ప్రదేశం నేడు చెత్తకుప్పల మధ్య మగ్గుతోంది. శుభ్రత లేకపోవడం, కనీస మౌలిక వసతులు, మొక్కలు-పిచ్చి మొలకలతో నిండిన మార్గాలు మున్సిపాలిటీ పనితీరుకు ప్రతిబింబంగా నిలుస్తున్నాయి. ప్రభుత్వం పర్యాటక అభివృద్ధికి కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నట్లు ప్రకటనలు చేస్తుంటే, జగ్గయ్యపేటలో మాత్రం ఆ నిధులు ఎక్కడికి పోతున్నాయన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. పర్యాటక స్థలం అభివృద్ధి బాధ్యత వహించాల్సిన మున్సిపాలిటీ అధికారులు కళ్లుమూసుకుని ఉండటమే కాకుండా, ప్రజల ఫిర్యాదులను కూడా పట్టించుకోవడం లేదు. ఈ నిర్లక్ష్యం వల్ల జగ్గయ్యపేట పట్టణ ప్రతిష్ఠ దెబ్బతింటోంది. ఒకప్పుడు సందర్శకులతో కళకళలాడిన ఈ ప్రదేశం నేడు పాడుబడిన ప్రాంతంగా మారడం మున్సిపాలిటీ వైఫల్యానికి నిదర్శనం అని స్థానికులు మండిపడుతున్నారు. ఇది అభివృద్ధి కాదూడ ప్రభుత్వ ఆస్తుల్ని నిర్వీర్యం చేయడమే అని స్థానికులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జగ్గయ్యపేట మున్సిపాలిటీ మేల్కొని తక్షణమే చర్యలు తీసుకోకపోతే, ప్రజా ఉద్యమాలకు సిద్ధమవుతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.
లేకపోతే పర్యాటకాభివృద్ధి పేరుతో జరుగుతున్న ఈ నిర్లక్ష్యం చరిత్రలో మరో వైఫల్యంగా మిగిలిపోవడం ఖాయమని స్థానికులు అంటున్నారు.



## ప్రజల సమస్యలకు ప్రజా దర్బార్

నందిగామ, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 06 : నందిగామ 9వ వార్డులో ప్రజా దర్బార్ లో స్థానికుల నివేశ స్థలాల అభ్యర్థనపై ప్రత్యేక దృష్టి మౌలిక వసతుల కల్పన కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పందించారు. నందిగామ పట్టణం 9వ వార్డు ముక్కపాటి కాలనీ నాగేంద్ర స్వామి పుట్ట వద్ద ప్రజా దర్బార్ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అధికారులు, కూటమి నేతలతో కలిసి పాల్గొన్నారు. వార్డులో కూటమి పాలనలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని ఆమె వివరించారు. స్థానికులు ఎక్కువగా నివేశ స్థలాలు కోరుతున్నారని, దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజల అవసరాలను తీర్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మౌలిక వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని ఎమ్మెల్యే సౌమ్య స్పష్టం చేశారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా విని, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ ప్రజా దర్బార్ ద్వారా స్థానికుల అభ్యర్థనలు, అభివృద్ధి అవసరాలు వెలుగులోకి వచ్చాయి. ప్రజలతో నేరుగా మమేకమై, వారి సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఈ కార్యక్రమం ద్వారా మరోసారి స్పష్టమైందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ మండవ కృష్ణకుమారి, వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్, అధికారులు, కూటమి నేతలు మరియు స్థానిక ప్రజానీకం పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రైల్వే ఉద్యోగి దారుణ హత్య

కావలి.
నెల్లూరు జిల్లా కావలి రూరల్ మండలంలోని రుద్రకోట హరిజనవాడలో ఆరే. నాగరాజు అనే రైల్వే ఉద్యోగి తన నివాసంలోనే దారుణ హత్యకు గురయ్యారు. స్థానికుల సమాచారంతో సీఐ రాజేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ సాయంతో ఆధారాలు సేకరించారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కొంతకాలంగా భార్య ప్రకాశం జిల్లా చిన్నగంజాం లో తల్లిదండ్రులువద్ద ఉంటుందని,నాగరాజు డ్యూటీ చేసుకుంటూ తన ఇంటి వద్ద ఒంటరిగా ఉంటున్నారని అంటున్నారన్నారు. నాగరాజు పిన్నమ్మ ఉదయం నాగరాజు ఇంటి వద్దకు ముగ్గు వేయడానికి వచ్చిందని తలుపు తీసి చూడగా మృతి చెందడం గమనించారన్నారు. ఈ విషయం పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని సీఐ రాజేశ్వర రావుతెలిపారు. దీంతో గ్రామస్తులంతా భయభ్రాంతులకు గురి అయ్యారు.

## "ఎయిడెడ్ పాఠశాలల తనిఖీ.




కావలి,
కావలి స్థానిక డాక్టర్ లక్ష్మీ కృష్ణారావు విశ్వో దయ బాలుర ఉన్నత పాఠశాల మరియు రాజా విశ్వోదయ బాలికో న్నత పాఠశాలలకు మండల విద్యాశాఖ అధికారి బండి గోవిందయ్య విచ్చేసి, పాఠశాలలో యూడైస్ వివరములకు విద్యార్థుల వాస్తవ సంఖ్యకు సరిచూసి, పాఠశాలలకు విచ్చేసిన విద్యార్థుల సంఖ్యను లెక్కించి దీర్ఘకాలికంగా పాఠశాలకు రాని విద్యార్థుల పేర్లను పాఠశాలలో లేనట్లుగా గుర్తించి సంతృప్తిని వ్యక్తం చేశారు. 100 డేస్ యాక్షన్ ప్లాన్ లో భాగంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్షల్లో వస్తున్న మార్కుల తీరును పరిశీలించి, విద్యార్థులు అందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.




## సామూహిక ఎలుకలు నివారణ అందరి బాధ్యత

తాళ్ళరేవు, సింహగర్జన ప్రతినిధి (ఎలిపే నాగేశ్వరరావు) ఫిబ్రవరి 06 : కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పి.మల్లవరం పరిధిలోని రెండు రైతు సేవా కేంద్రాలు పరిధిలోని రైతులు అందరికి అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి ప్రశాంతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులు అధిక దిగుబడులు సాధించాలని అందులో భాగంగా ప్రధాన సమస్య ఎలుకలు తీవ్రత వలన పంట నష్టం లేకుండా రైతులు అందరూ ఒకేసారి సామూహికంగా ఎలుకలు నివారణ మందు బ్రోమాడియోలోన్ నూకలుతో కలిపి ప్రతీ ఎలుక కన్నం వద్ద పది గ్రాములు పొట్లం పెట్టాలన్నారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ (బాబి) మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనా విధానాలుతో రైతులను అనేక విధాలుగా ప్రోత్సహిస్తూ రైతే రాజు అనేవిధంగా ప్రభుత్వ పనితీరు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు గుత్తుల వెంకటరమణ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పెచ్చెట్టి శ్రీలక్ష్మి శ్రీనివాస్, దడాల సత్తికొండ, గౌతం, యంపిటిసి రాంబాబు, సుధాకర్, నాగార్జున, వెంటపల్లి వెంకన్న, వ్యవసాయ సిబ్బంది గౌతమి, ప్రియాంక, తేజేశ్వరీ తదితరులు పాల్గొన్నారు

## పర్యావరణ పరిరక్షణ- కాలుష్య నియంత్రణకు చర్యలు

తాళ్ళరేవు, సింహగర్జన ప్రతినిధి (ఎలిపే నాగేశ్వరరావు) ఫిబ్రవరి 06 : తాళ్ళరేవు మండలం పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని ఓఎన్జిసి సంస్థ పరిసర ప్రాంతాలను జిల్లా అటవీ శాఖ అధికారి రామచంద్రరావు, సోషల్ ఫారెస్ట్ రేంజ్ అధికారిని సత్యపద్మజలు పరిశీలించారు. హరితహారం అభివృద్ధి కోసం పి.మల్లవరం గ్రామంలో రహదారుల పక్కన చెట్లు పెంచే కార్యక్రమం చేపట్టినట్లు అధికారులు తెలిపారు. వీరితో స్థానిక నాయకులు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ధూళిపూడి వెంకటరమణ (బాబి) చెట్లు పెంచుటకు అనువైన రహదారులను సూచించారు. చెట్లు పెంచడానికి స్థానికులు కూడా తమ సహకారం అందించాలని జిల్లా అటవీ శాఖ అధికారి కోరారు. సోషల్ ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ అధికారి రవి, రాయుడు సింహాచలం, సూరంపూడి రాజు, అర్జున్ రావు, సాయి, మహేష్ స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## గ్రామీణ సేవల్లో ముందంజలో లిటిల్ స్టార్స్ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్






పిఠాపురం, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 06 : గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేదలు, వృద్ధులు, బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా లిటిల్ స్టార్స్ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ఈ క్రమంలో పిఠాపురం, వెల్దుర్తి మరియు పరిసర ప్రాంతాలకు చెందిన 150 మంది నిరుపేద వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. శీతాకాలంలో చలి తీవ్రత పెరిగి వృద్ధులు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు ట్రస్ట్ చైర్మన్ టీ.కామేశ్వరరావు తెలిపారు. డిసెంబర్ నెల నుంచి చలి తీవ్రత ఎక్కువగా ఉండటంతో వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఇలాంటి సందర్భాల్లో వారికి అండగా నిలవడం ట్రస్ట్ యొక్క ప్రధాన బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా పేదలు, వృద్ధులు, విద్యార్థులు మరియు గ్రామీణ ప్రజల సంక్షేమం కోసం ఇలాంటి మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు సి.హెచ్.అబ్బాయి, మహేష్ తదితరులు పాల్గొన్నారు. రగ్గులు అందుకున్న వృద్ధులు లిటిల్ స్టార్స్ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ నిర్వాహకులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో సేవాభావంతో ముందుకు సాగుతున్న లిటిల్ స్టార్స్ రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ చేస్తున్న ఈ తరహా కార్యక్రమాలు అనేక మందికి ప్రేరణగా నిలుస్తున్నాయని వారన్నారు

## కోరిన కోరికలు తీర్చే బంగారు పాపదేవాలయం

పిఠాపురం, సింహగర్జన ప్రతినిధి, ఫిబ్రవరి 06 :
కోరిన కోరికలు తీర్చే బంగారు పాపదేవాలయం కొలువై ఉన్న బషీర్ బీబీ బంగారు పాప అని జనసేన పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు అన్నారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం ఉప్పాడ కొత్తపల్లి మండలం పొన్నాడ గ్రామంలో ఉరుసు ఉత్సవాలు ప్రారంభ కార్యక్రమంలో ముక్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 300 సంవత్సరాల నుండీ ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నారని, కోరిన కోరికలు తీర్చే బంగారు బంగారు పాప అని కొనియాడారు. రాబోయే రోజుల్లో తనని ఎమ్మెల్యే చేయమని కోరుకున్నాను అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మాట్లాడుతూ స్థానిక ముజావర్లు ప్రతి సంవత్సరం ఘనంగా ఉరుసు ఉత్సవాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. తాను ఎమ్మెల్యే పదవి కావాలని కోరుకున్నాను అని అయ్యానని చెప్పారు.



పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు మాట్లాడుతూ చాలా గొప్ప చరిత్ర ఈ ఆలయానికి ఉందని, మన నియోజకవర్గంలో ఉండడం మన అదృష్టం అన్నారు. బంగారు పాప దేవాలయం స్థానిక జనసేన నాయకులు, ప్రముఖ వైద్యులు జ్యోతుల శ్రీనివాస్ తన స్వంత నిధులు రూ. 10లక్షల రూపాయలతో ఆధునికంగా నిర్మించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని జనసేన పార్టీ అధ్యక్షులను సభికులందరూ అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బండి దావీదు, వాడ్ర ధనబాబు, పల్లెటి బాపన్న దొర, ఎరకం నుకారెడ్డి తదితరులు పాల్గొన్నారు



# చందమామ కెరీర్ ముగిసినట్లేనా?

కాజల్ అగర్వాల్ అలియాస్ చందమామ టాలీవుడ్ కెరీర్ జర్నీ గురించి చెప్పాల్సిన పనిలేదు. రెండు దశాబ్దాల ప్రయాణంలో దాదాపు స్టార్ హీరోలందరి సరసన నటించింది. సీనియర్ హీరోల నుంచి తర్వాత తరం సూపర్ స్టార్ల వరకూ అందర్నీ కవర్ చేసిన నటి కాజల్. -లక్ష్మీకళ్యాణం- నుంచి -కన్నప్ప- వరకూ చందమామ నటిగా ఒకే రకమైన ఛరిష్మాతో కొనసాగింది. టాలీవుడ్ లో అత్యంత వేగంగా స్టార్ లీగ్ లో చేరి నటిగాను కాజ్ ల్ ను చెప్పొచ్చు. ఒక్క సినిమా కాజల్ కెరీర్ లో వెనక్కి తిరిగి చూడకుండా చేసింది. అదే -మగధీర-. -లక్ష్మీకళ్యాణం-తో హీరోయిన్ గా లాంచ్ అయిన అమ్మడు అప్పటికే మరో రెండు సినిమాలు చేసింది. కానీ అవి ఆశించిన ఫలితాలు సాధించలేదు. అదే సమయంలో దర్శకుడు రాజమౌళి దృష్టిలో పడింది. -మగధీర-లో మిత్రవింద పాత్రతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చిర స్థాయిగా నిలిచిపోయింది. ఆ సినిమాలో హీరోగా న టించిన రామ్ చరణ్ కు ఎంత పేరొచ్చిందో? మిత్ర విందా పాత్రతో అంతే క్రేజ్ కాజల్ కు దక్కింది. మిత్ర వింద పాత్రతో ఎంతో మంది నటీమణులకు స్పూర్తిగా నిలిచింది. నవతరం నటీమణుల్లో సైతం స్పూర్తిని నింపిన రోల్ అది. హీరోయిన్ గా ఎలాంటి రోల్ పోషించాలని అడిగితే? అంతా యువరాణి మిత్రవింద లాంటి పాత్ర ఒక్కటి చేసినా చాలా సంతోషంగా సినిమాల నుంచి రిటైర్మెంట్ తీసుకోవచ్చు అని చెప్పిన వారెంతో మంది. అంతగా ఆ పాత్ర ప్రభావం హీరోయిన్లపై ఉందన్నది కాదనలేని నిజం. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద 100 కోట్ల వసూళ్లతో సరికొత్త రికార్డు సృష్టించింది. అప్పటి నుంచి కాజల్ కెరీర్ లో వెనక్కి తిరిగి చూడలేదు. స్టార్ హీరోలే టార్గెట్ గా సినిమాలు చేసింది. ఇతర భాషల్లో కూడా అవకాశాలు మొదలయ్యాయి. తమిళ తో పాటు హిందీ అవకాశాలు అందుకుంది. అయితే హిందీ కంటే కోలీవుడ్ లోనూ మంచి సక్సెస్ ను చూసింది. టాలీవుడ్ తరహాలోనే కోలీవుడ్ లోనూ అమ్మడి జర్నీకి తిరుగు లేదు కొంత కాలం. ఇలా తెలుగు , తమిళ, హిందీ సినిమాల్లో నటిగా తనదైన ముద్ర వేసింది అటుపై వివాహం..పిల్లలు పుట్టడంతో పాటు కొత్త తరం హీరోయిన్ల నుంచి పోటీ పెరిగింది. దీంతో అవకాశాలు తగ్గాయి. సెకెండ్ లీడ్స్ విషయంలోనూ వెనకడుగు వేయలేదు. కాలంతో పాటు వచ్చిన మార్పుగా స్వీకరించి వాటిలోనూ కొనసాగింది. ఐటం పాటల్లోనూ సత్తా చాటింది. చివరిగా -భగవంత్ కేసరి-లో హీరోయిన్ గా నటించింది. గత ఏడాది రిలీజ్ అయిన -కన్నప్ప-లో గెస్ట్ రోల్ పోషించింది. ఐదేళ్ల క్రితం నుంచే కెరీర్ డల్ గా సాగుతోంది. ఈ గ్యాప్ లో చేసిన రెండు చిత్రాలే అవి. ప్రస్తుతం కాజల్ తెలుగులో సినిమాలు చేయలేదు. దీంతో కాజల్ టాలీవుడ్ ప్రయాణం ముగిసినట్లేనా? అన్న చర్చ ఫిలిం సర్కిల్స్ లో తెరపైకి వస్తోంది. బాలీవుడ్ లో మాత్రం -రామాయణం- సహా -ది ఇండియన్ స్టోరీ-లో నటిస్తోంది.



# మరో ప్రయోగానికి అలియాభట్ సిద్ధం!

నెటి జనరేషన్ బాలీవుడ్ హీరోయిన్లందరిలో అలియాభట్ ప్రత్యేకం అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎంతో మంది హీరోయిన్లు..వారసులు పరిశ్రమలో ఉన్నా? అలియాభట్ మాత్రం వారందరీ కంటే ఓ మెట్టుపైనే ఉంది అన్నది కాదనలేని నిజం. ఆమె ఎంపిక చేసుకుంటోన్న పాత్రలు సహా పెర్పార్మెన్స్ మాత్రమే అమ్మడిని ఆ స్థానంలో కూర్చోబెట్టాయి. కమర్శియల్ చిత్రాలైనా? ప్రయోగాత్మక పాత్రలైనా? గంగూబాయి లాంటి లేడీ డాన్ రోల్ అయినా అవలీలగా పోషించగలదని ఇప్పటికే ప్రూవ్ చేసుకుంది. గ్లామర్ పాత్రల పరంగా అలియా అభినయం గురించైతే చెప్పాల్సిన పనిలేదు. 'ఆల్ఫా' లాంటి చిత్రానికి ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ యశ్ రాజ్ ఫిలింస్ ప్రత్యేకంగా అలియాభట్ నే స్పై పాత్రకు ఎంపిక చేసిదంటే? అలియా ఎంత గొప్ప పెర్పార్మర్ కాకపోతే ఛాన్స్ ఇస్తారు. ఆ రూపంలో మరోసారి అలియా ఎంతటి ప్రతిభావంతురాలు అన్నది ప్రూవ్ అయింది. గంగూబాయి కతివాడిలో గంగూబాయిగా ఓ సంచలనమే సృష్టించింది. లేడీ డాన్ గెటప్ లో అమ్మడి మాస్ అప్పిరియన్స్ కి ఫిదా కాని వారుండరు. అంతటి ప్రతి భావంతురాలు కావడంతో? ఈ సారి మరో ప్రయోగానికి రెడీ అయింది. చాశ్రీంశీ =ఘుం - లోకేష్ కనగరాజ్‌కు షాక్ ఇచ్చిన రజనీ డాటర్! అందుకు అన్ని రకాలుగా అర్హురాలిగా భావించే దర్శకుడు అభిషేక్ పాఠక్ తన సినిమాలో ప్రధాన పాత్రకు ఎంపిక చేసాడు. అలియాభట్ ప్రధాన పాత్రలో -హౌస్ వైఫ్- అనే ఓ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నాడు పాఠక్. వివాహమైన ఓ జంట చుట్టూ తిరిగే కథ ఇది. ఈ రిలేషన్ షిప్ డ్రామాలో మరో కీలక పాత్రకు నేచురల్ పెర్పార్మర్ రాజ్ కుమార్ రావ్ ని తీసుకుంటున్నారు. ఆయనకు భార్య పాత్రలోనే అలియాభట్ కనిపించనుంది. అయితే ఈ భార్యాభర్తల్ని అభిషేక్ పాఠక్ చాలా బోల్డ్ గా చూపించబోతున్నాడు? అన్నది హైలైట్ అంశం. నాలుగు గోడల మధ్య ఉండే భార్యభర్తల రహస్య బంధాన్ని ఎంతో బోల్డ్ గా చూపించబోతున్నాడట. లస్ట్ స్టోరీలు సహా బాలీవుడ్ బోల్డ్ యాంగిల్ ని మించి రిలేషన్ షిప్ లో ఘాడతను చూపించబోతున్నాడని మీడియాలో ప్రచారం జరుగుతోంది. భర్త పాత్రను రాజ్ కుమార్ రావ్ పోషించిన భార్య పాత్రలో? అలియాభట్ ఆద్యంతం హైలైట్ అవుతుందని అంటున్నారు. ఈ జానర్ వెండి తెరకు కొత్తేం కాదు. కాకపోతే? ఆ బంధాన్ని పరిమితం మేర మాత్రమే చూపించారు. ఓ క్లాసిక్ చిత్రాలుగానే ఆ జానర్ హైలైట్ అయింది. కానీ అభిషేక్ పాఠక్ అంతకు మించి ఏదో చెప్పబోతున్నడని తెలుస్తోంది. ఇలాంటి కంటెంట్ వివాదాస్పదం అవ్వడానికి అవకాశాలు ఎక్కువగానే ఉంటాయన్నది అంతే వాస్తవం



## 'ఇది భ్రమల ప్యాలెస్' అంటూ క్యూట్ పిక్స్ షేర్ చేసిన రాశీ ఖన్నా

'ఊహలు గుసగుసలాడే' సినిమాతో తెలుగు సినీ ప్రేక్షకులకు పరిచయమైన రాశీ ఖన్నా తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్ గా గుర్తింపు తెచ్చుకుంది. చివరిగా సిద్ధు జొన్నలగడ్డ సరసన 'తెలుసు కదా' చిత్రంలో కనిపించింది. ఈ సినిమాలో రాశీ ఖన్నాకు మంచి మార్కులు పడ్డాయి. ప్రస్తుతం ఆమె పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సరసన 'ఉస్తాద్ భగత్ సింగ్'లో నటిస్తోంది. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. మార్చి 26న ఈ సినిమా రిలీజ్ కాబోతోంది. ఈ సినిమాలో శ్రీలీల కూడా హీరోయిన్ గా నటిస్తోంది. మరోవైపు, రాశీ ఖన్నా తాజాగా ఇన్స్టాగ్రామ్ లో షేర్ చేసిన ఫొటోలు వైరల్ అవుతున్నాయి. ఈ ఫొటోల్లో బ్లాక్ అవుట్ ఫిట్ తో, బ్లాక్ పెండెంట్ ఉన్న చైన్ తో రాశి బోల్డ్ గా కనిపిస్తోంది. ఈ ఫొటోలకు 'ఇది భ్రమల ప్యాలెస్' అంటూ క్యాప్షన్ పెట్టింది.

## 'మన శంకర వరప్రసాద్ గారు' ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్..

మెగాస్టార్ చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం ఇప్పుడు ఓటీటీలో సందడి చేసేందుకు సిద్ధమైంది. సంక్రాంతికి థియేటర్లలో విడుదలై భారీ విజయం సాధించిన ఈ సినిమా.. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జీ5లో ఈ నెల 11 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ మేరకు అధికారిక ప్రకటన వెలువడింది.ప్రముఖ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్, జనవరి 12న సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకొచ్చింది. విడుదలైన తొలి షో నుంచే పాజిటివ్ టాక్ సొంతం చేసుకుని బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపించింది. అనూహ్యంగా కేవలం ఆరు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ పూర్తి చేసుకుని, నిర్మాతలకు లాభాల బాట పట్టించింది.ఈ సినిమా ఓటీటీ విడుదలలో ఒక ప్రత్యేకత ఉంది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళం, హిందీ, మరాఠీ, బెంగాలీ భాషల్లోనూ ఒకేసారి అందుబాటులోకి రానుంది. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులు ఈ చిత్రాన్ని తమ భాషల్లో వీక్షించే అవకాశం లభించనుంది.థియేటర్లలో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'మన శంకర వరప్రసాద్ గారు', ఇప్పుడు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌పై కూడా అదే స్థాయిలో ఆదరణ పొందుతుందని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తోంది. థియేటర్లలో చూడలేకపోయిన ప్రేక్షకులు, మరోసారి చూడాలనుకునే అభిమానులు ఈ ఓటీటీ విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.







Published and Owned by Yandra Sri Veera Venkata Suneel Kumar, Door No : 14-1-52, Beside Union Bank of India, Main Road, Pithapuram, Kakinada District, AP, Pin : 533450. Cell - 9966655091. Registration No : AP-03-0000025, Email ID : kumarjournalist555@gmail.com, Editor : Dr Suneelkumar Yandra, Chief Editor : Maddirala Roja, www.simhagarjana.com